
చెన్నారెడ్డినగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

సికింద్రాబాద్‌లో పద్మారావు గెలుపు ఖాయం

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం రాత్రి అంబర్‌పేట డివిజన్‌లో బాపూనగర్, చెన్నారెడ్డినగర్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నింబోలి అడ్డలో పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

కాచిగూడలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. గురువారం నింబోలిఅడ్డ లాల్‌బహదూర్ హైస్కూల్ వద్ద తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు మల్లికార్జున్, వెంకటేష్, రమాదేవి, రాము, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం

ముషీరాబాద్/కవాడిగూడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆరు డివిజన్లకు ఎన్నికల ఇన్‌చార్జిలను ఎమ్మెల్యే ముఠా గోపాల్ నియమించారు. ముషీరాబాద్ డివిజన్‌కు రంజన్ నాయుడు, మున్వర్ చాంద్, భోలక్‌పూర్ డివిజన్‌కు అస్లాం, రాజ్‌మోహన్, గాంధీనగర్ డివిజన్‌కు డి. శివముదిరాజ్, శ్రీశైలంయాదవ్, అడిక్‌మెట్ డివిజన్‌కు దీన్‌దయాల్ రెడ్డి, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, రాంనగర్ డివిజన్‌కు కరికె కిరణ్, చందుగౌడ్, కవాడిగూడ డివిజన్‌కు శ్రీనివాస్‌గుప్తా, ఆకుల శ్రీనివాస్, గాంధీనగర్ డివిజన్‌కు ఎన్నికల ఇన్‌చార్జిగా సింధం శ్రీశైలం యాదవ్ నియమితులయ్యారు.

'కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై శ్వేతప్రతం విడుదల చేయాలి'

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ఐదేళ్లలో బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని యువజన కాంగ్రెస్ కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కిషన్‌రెడ్డి తాను చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పి ఓట్లు అభ్యర్థించకుండా ప్రధాని మోదీని చూసి ఓట్లు వేయాలని కోరడం ఆయన నైతిక ఓటమికి నిదర్శనమన్నారు. సికింద్రాబాద్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో దానం నాగేందర్‌కు లక్ష ఓట్లు వచ్చేలా తాము పనిచేస్తున్నామన్నారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ నియోజకవర్గంలో ప్రచారం చేస్తూ దానం నాగేందర్ గెలుపునకు కృషి చేస్తున్నారని తెలిపారు.

పద్యనాటకాలను ముందుతరాలకు అందించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక పద్యనాటకాలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని జవహర్ బాలభవన్ మాజీ డైరెక్టర్ డా. ఎంకే రాము అన్నారు. రాష్ట్రప్రభుత్వ చలన చిత్ర నాటకరంగ అభివృద్ధి సంస్థ సౌజన్యంతో కల్పన కళా నికేతన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీకృష్ణ రాయబారం, కర్ణసందేశం పద్యనాటక దృశ్యప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో రాము మాట్లాడుతూ.. పద్యనాటకాలను ముందు తరాలకు అందించాల్సి ఉందన్నారు. దీర్ఘరాగాలాపనతో నటీనటులు నాటకాలు ప్రదర్శిస్తుంటే ఈనాటి తరంవారు మైమరచిపోవడం చూస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ జడ్జి బూర్గుల మధుసూదన్, విక్కీ డ్యాన్స్‌మాస్టర్, శ్రీనివాసరావు, గడ్డం లాలయ్య, నిర్వాహకుడు, నటుడు దొంతి జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.


పద్యనాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం


గోశాలకు పశుదాణా అందజేస్తున్న మహేష్ అగర్వాల్

గోశాలలకు ఉచితంగా పశుదాణా అందజేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గోశాలలకు పశుదాణా, తాగునీటిని ప్రభుత్వం ఉచితంగా అందజేయాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మహేష్ అగర్వాల్ డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలో గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్, పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో గోశాలలకు పశుదాణాను అందజేస్తున్నామన్నారు. ఉప్పుగూడలో వీరాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న గోశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో పశుదాణా అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ప్రేమ్‌చంద్, లక్ష్మణచారి, దిలీప్‌కుమార్, బాబురావు, మనోహర్, రాజు, దాసోజు లక్ష్మణ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు, బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ రథోత్సవాన్ని చిక్కడపల్లి, వివేక్‌నగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించారు.

'మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ సేవలు మరువలేనివి'

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోగులకు సేవలందించడంలో మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యుల సేవలు మరువలేనివని ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్. కె. శంకర్ అన్నారు. గురువారం ఆస్పత్రి ప్రాంగణంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయాన్ని పునఃప్రారంభించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ మాట్లాడుతూ.. యూనియన్ కార్యాలయాన్ని పునఃప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ చంద్రశేఖర్, ఏవో మోహన్‌దాస్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బూస్, ఫీవర్ ఆస్పత్రి బ్రాంచ్ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు పద్మజ జనార్దన్, సంయుక్త కార్యదర్శులు సంతోష్, సత్యనారాయణ పాల్గొన్నారు.


దానం నాగేందర్‌ను కలిసిన మహేష్‌యాదవ్ తదితరులు


నాగేందర్‌కు మద్దతుగా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు

బీఆర్ఎస్, బీజేపీని ప్రజలు నమ్మేస్థితిలో లేరు

● దానం నాగేందర్

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. మహేష్‌యాదవ్‌తో పాటు పలువురు నేతలు దానంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, నాయకులు ఎం. శ్యామ్‌రాజ్, సందీప్‌కుమార్, రవికుమార్, బబ్లూ, సుభాష్, ఫ్రాన్సిస్, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దానంను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాం

పంజాగుట్ట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మాల మహానాడు, మాల ప్రజా సంఘాల జేఏసీ మద్దతు ప్రకటించాయి. ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లో మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, మన్నే శ్రీధర్ రావు, గోపోజు రమేష్‌తో కలిసి దానం నాగేందర్‌కు మద్దతు తెలుపుతూ.. రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. దేశాన్ని రక్షించుకోవాలంటే, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కాపాడుకోవాలంటే కాంగ్రెస్ పార్టీని బలపర్చాలని అన్నారు.

కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మాన్ని ప్రవేశపెట్టాలని చూస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లను తొలగించాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దళిత, బహుజన, మైనారిటీలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి, దానం నాగేందర్‌ను గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు బంగి ఆనంద్, జి.కళ్యాణ్, జి.రమేష్, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ మద్దతు

పంజాగుట్ట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే తమ పూర్తి మద్దతు ఉంటుందని, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేస్తామని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఉషాకిరణ్ ప్రకటించారు. తెలంగాణలో ఆదివాసీ, గిరిజనుల హక్కుల రక్షణ కోసం కృషి చేస్తున్న, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఫెడరేషన్ నాయకులతో కలిసి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఫెడరేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మేడ విజయ్, విద్యార్థి విభాగం అధ్యక్షురాలు దేవర విజయ, చెంచు కమ్యూనిటీ కన్వీనర్ బి.రామస్వామి, దేవరాయ సురేష్, శైలేందర్, డాక్టర్ స్టీఫెన్, తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉషాకిరణ్, నాయకులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేపీ సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డి

కవాడిగూడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ నేతలను నిలదీయాలని కోరారు. గురువారం కవాడిగూడ డివిజన్ కొత్తబజార్ సంకట విమోచన హనుమాన్ దేవాలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొత్తబజార్, మసీద్ గల్లీ, శివాజీచౌక్, రాజ్‌కమల్ టెంట్‌హౌస్, ఉన్నికోట, తాళ్లబస్తీ, చిత్రానగర్‌లలో ప్రచారం చేశారు. తాళ్లబస్తీలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు. ప్రచారంలో కార్పొరేటర్ జి. రచనశ్రీ, మాజీ కార్పొరేటర్‌లు టి ఇందిర, టి రవీందర్, ఓబీసీ మోర్చానగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు జి. వెంకటేష్, రంగరాజ్‌గౌడ్, పరిమళ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కవాడిగూడ తాళ్లబస్తీలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి

ముషీరాబాద్: ప్రజలను మోసం చేసే కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం భోలక్‌పూర్, ముషీరాబాద్ డివిజన్లలో కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ తో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని కాపాడేందుకు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఓట్ల కోసం ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రచారంలో బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి సీకే శంకర్‌రావు, బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ఇంటింటి ప్రచారం

దేశంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషిచేస్తున్న నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లో అంబేడ్కర్‌నగర్, వినోబానగర్, గంగపుత్రకాలనీ, బాపూజీనగర్ ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్, బీజేవైఎం నగర్ కార్యదర్శి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని గెలిపించాలి

నల్లకుంట: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డిని గెలిపించాలని మాజీ కార్పొరేటర్ వనం రమేష్ కోరారు. గురువారం నల్లకుంటలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబర్‌పేట నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

శేషగిరిరావుకు అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గన్ మిస్‌ఫైర్ అయి మృతిచెందిన సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.వి. శేషగిరిరావుకు గురువారం అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. చిక్కడపల్లి బాపూనగర్‌కు చెందిన శేషగిరిరావు సీఆర్‌పీఎఫ్‌లో పనిచేస్తున్నారు. భద్రాచలంలో బుధవారం ఉదయం కూంబింగ్ జరిపి తిరిగి వస్తుండగా గన్ మిస్‌ఫైర్ అయి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని గురువారం నగరానికి తీసుకొచ్చారు. సీఆర్‌పీఎఫ్ అధికారులు, పోలీసులు శేషగిరిరావు మృతదేహం వద్ద నివాళులర్పించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య, బీజేపీ నాయకుడు వినయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు జైసింహ, రాకేష్, కోళ్ళ సుధాకర్ తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


అంతిమ యాత్రలో పోలీసులు, వివిధ పార్టీల నేతలు, ఇన్‌సెట్‌లో శేషగిరిరావు (ఫైల్)

నాటకరంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయం

రవీంద్రభారతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా నాటక పోటీలు నిర్వహిస్తూ నటీనటులను ప్రోత్సహించడంతోపాటు రంగస్థల వృద్ధికి పరుచూరి బ్రదర్స్ కృషి చేయడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. గురువారం రవీంద్రభారతిలో పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయ స్థాయి నాటిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అతిథులుగా ఆచార్య డి.ఎస్.ఎన్. మూర్తి, పరుచూరి గోపాలకృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి గోపాలకృష్ణ, దైవజ్ఞశర్మ, నటి శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. డి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ.. 34 సంవత్సరాలుగా పరుచూరి రఘుబాబు పరిషత్తులో దాదాపు 600 నాటకాలను ప్రదర్శించారని గుర్తు చేశారు. పరుచూరి రఘుబాబు పేరిట నాటక పోటీలను నిర్వహించి నాటక రంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. యువ నటీనటులు, దర్శకులు ఇలాంటి వేదికలను ఒక అవకాశంగా మార్చుకుని ముందుకు సాగాలని సూచించారు. వేలాది మంది నటీనటులకు వేదిక కల్పించిన ఘనత పరుచూరి సోదరులదని అన్నారు. రంగస్థల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. తాను సిటీ కాలేజీలో చదువుతున్నప్పుడు దేశంలోనే పేరొందిన రవీంద్ర భారతిలో నటించాలని ఉండేదని గుర్తు చేసుకున్నారు. సభానంతరం రాత నాటిక, జేబు చెప్పిన ఊసులు, రైతేరాజు, బూడిద నాటకాలను ప్రదర్శించారు. చక్కటి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు.


నాటక పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

రౌడీషీటర్‌కు ఏడాది జైలు


రౌడీషీటర్ అనిల్

చిక్కడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటరకు న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష, జరిమానా విధించింది. నాగమయ్యకుంటకు చెందిన పి. సుదర్శన్‌పై అతడి ఇంటిపక్కన నివసిస్తున్న అనిల్ 2018 జూన్ 19న దాడిచేశాడు. బండరాయితో సుదర్శన్ తల పగులగొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ పి. బాలరాజు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అనిల్‌పై రౌడీషీట్ ఓపెన్ చేశారు. గురువారం కేసును విచారించిన నాంపల్లి 9వ ఏసీఎంఎం కోర్టు న్యాయాధికారి ఉదయభాస్కర్ నిందితుడు అనిల్‌కు ఏడాది జైలు శిక్ష, రెండువేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు.

రైలులో ప్రయాణికురాలి పుస్తెలతాడు చోరీ

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసర ప్రాంతానికి చెందిన జ్యోతి (32) బుధవారం రాత్రి అజంతా ఎక్స్‌ప్రెస్‌లో షిరిడీ నుంచి కాచిగూడ వస్తోంది. మార్గమధ్యంలో పూర్ణ జంక్షనవద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును అపహరించారు. బాధితురాలు కాచిగూడ పీఎస్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఉద్యమకారుడు నాదయ్యకు నివాళి

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారుడు నాదయ్య మృతి బాధాకరం అని 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ కన్వీనర్ ఎస్. గోపాల్‌రావు అన్నారు. గురువారం చప్పల్‌బజార్‌లో కార్యాలయంలో నాదయ్య సంస్మరణ సభ నిర్వహించారు. నాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్. గోపాల్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో త్యాగాలు చేసిన నాటి విద్యార్థి నేతలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాలను గుర్తించాలని ఆయన కోరారు.

పట్టుబడిన వాహనాల వేలం 2న

ముషీరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను మే 2వ తేదీన ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం వేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ డి. రామకృష్ణ, గురువారం తెలిపారు.

28న మాతృమూర్తుల పోటీలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మైత్రి మహిళామండలి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ సాయంత్రం మాతృమూర్తులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు ఎస్. లలిత తెలిపారు. విజేతలకు వచ్చేనెల 21న మాతృదినోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. పోటీలు గాంధీనగర్ జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో జరుగుతాయని, వివరాలకు 93911 04299 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.



నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

మోదీ పాలనలో నయవంచనపై కాంగ్రెస్ నిరసన

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మోదీ పదేళ్లపాలనలో చేసిన నయవంచన కార్యక్రమాల పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ కమిటీ బి-బ్లాక్ కమిటీ అధ్యక్షుడు అంజియాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్. కల్పనాయాదవ్, నాయకులు లోకేష్‌యాదవ్, గజ్జెల సూర్యనారాయణ, వెంకట్, పట్నం నాగభూషణంగౌడ్, సయ్యద్‌జువేర్ హుస్సేన్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీకి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.



టీచర్స్ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

భావితరానికి ఉపాధ్యాయులే రూపకర్తలు

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భావితరానికి ఉపాధ్యాయులే రూపకర్తలని, దేశభవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బాలోత్సవం పేరుతో గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విద్యాబోధనలో నిరంతరం ఆధునికతను అందుకుందామనే అంశంపై టీచర్స్ వర్క్‌షాప్ జరిగింది. ముఖ్యఅతిథులుగా సుద్దాల అశోక్‌తేజ, ఇంపాక్ట్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు, ప్లే క్లాస్ స్కూల్ చైర్మన్ వాసిరెడ్డి అమర్‌నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు నిరంతరం అధ్యయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షులు కె. సుజావతి, రూప, రుక్మిణి, రాము తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం

నల్లకుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ, అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మే 11వ తేదీ వరకు ఇస్కాన్ గీతా క్యాంపు శీర్షికన చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని సంస్థ కూకట్‌పల్లి శాఖ కో-ఆర్డినేటర్లు శ్రీవాణి, రోమా, విజయలక్ష్మి తెలిపారు. గురువారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దూలపల్లి మైసమ్మగూడలోగల డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరానికి హాజరైన చిన్నారులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనంతోపాటు ఉచిత ప్రయాణ, వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వివరాలకు 9440486792, 98490 19590, 9346373661 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.


మాట్లాడుతున్న శ్రీవాణి, రోమా, విజయలక్ష్మి

'అంకితభావంతో చదివితే సివిల్స్ సాధించొచ్చు'

చిక్కడపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అవిశ్రాంత కృషి, అంకితభావంతో చదివితే సివిల్స్ సాధించడం కష్టం కాదని 36వ ర్యాంకర్ ఆయుషి ప్రధాన్ అన్నారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు గురువారం ఉచిత సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుషి ప్రధాన్ మాట్లాడుతూ..అడ్డంకులను అధిగమించి చదివితే ఫలితం ఉంటుందన్నారు. 50వ ర్యాంకర్ కె. ఎస్. చందన జాహ్నవి కూడా మాట్లాడారు.